# ప్రయాణం

"కుసింత సోటెడతావేటిమీ"

ఉలిక్కిపడి కళ్లు విప్పేను. రెప్పల పైకి రాబోతున్న నిద్ర ఒక్కసారిగా బెదిరినట్లైంది. కంచుపళ్లెం మీద రాపిడికి పుట్టే శబ్దం లాంటి గొంతు, అదాటుగా గుడిగంట నెవరో ఠంగుమని మోగించినట్టు.

అనుకోకుండా జరిగి చోటిచ్చి ఓరకంటితో పరికించేను. నల్లని నిగనిగలాడే శరీరం, మామిడిపిందెలంచు ముదురు నీలం రంగు కొత్త నేతకోక నడుం చుట్టూ కుచ్చిళ్లు పోసి మోకాళ్ళమీదికి కట్టింది. దాని మీదికి రంగు వెలిసి బూడిదరంగుకి తిరుగుతూన్న నల్ల రవిక తొడిగింది. ముక్కుకు కుడివైపు అంచుపైన మూడు ముత్యాల బంగారు బులాకీ వేలాడుతోంది. చెవులకి మెరుపురాళ్ల ఇత్తడి దుద్దులు. మెళ్లో పసుపుతాడు పలుపుతాటి ముడితో మాసిపోయి మురికిఓడుతూ వుంది. ఆ తాడుకి వేలాడుతున్న పసుపుకొమ్ము ఏ రంగులో వుందో చెప్పడం కష్టం. మురికి పట్టిన ప్లాస్టిక్ గోనెసంచిలో విప్పేసిన చీరకాబోలు అస్తవ్యస్తంగా కుక్కేసి వుంది. ఆ సంచిని పదిలంగా ఒళ్లో పెట్టుకుని కూచుని, బొడ్లో దోపిన పైటచెంగు ముడి కోసం కాబోలు తడుముకుంటోంది. ఆ సంచిలోంచి ఒకలాంటి ముక్కిన వాసన వొస్తోంది.

"ఎందాకా?" అంది అటు తిరిగి కిటికీ పక్కన కూచున్న అమ్మాయితో మాట కలపబోతూ, "నా పేరు రావులమ్మ" అని కూడా అంది.

ఆ పిల్ల ఓసారిటు తిరిగి చూసి ముఖం తిప్పేసుకుంది. అప్పుడు చూసానాపిల్ల ముఖాన్ని, బాగా ఏడ్చి ఏడ్చి ఆపినట్టు ముక్కు కళ్లు ఎర్రగా వున్నాయి. కన్నీళ్లని మాత్రం జాడ తెలీనీకుండా కర్చీఫ్‌తో మాటిమాటికీ ఇంకా ఒత్తుకుంటూనే ఉంది.

అనాలోచితంగా టైం చూసుకున్నాను. ఒంటిగంట కావస్తోంది. రాత్రి నిద్ర చాలక అలసటగా ఉంది.

అరగంట పైనైంది ఖాళీ బస్సొచ్చి ఇక్కడాగి. పదిమంది కూడా లేని ప్రయాణీకులం ఎవరో తరుముకొస్తున్నట్టు తోసుకుంటూ నెట్టుకుంటూ బస్సెక్కాం. ఒక్కొక్కళ్లం ఒక్కో సీటులో ఆ సీటునికపైన ఎప్పటికీ సొంతం చేసుకున్నంత ధీమాగా కూర్చున్నాం. అందరి కన్నా ఆఖర్న స్థిమితంగా ఎక్కిందీ అమ్మాయి. ఎవరో వెనక నించి నెడుతున్నంత బలవంతంగా నడిచొచ్చి, నన్ను దాటుకుని వెళ్లి కిటికీ పక్కన కూర్చుంది. కిటికీ ఊచలపైన రెండు చేతులూ ఆనించి ఆ చేతులపైన ముఖం దాచుకుంది.

ఎగిరెగిరి పడుతున్న ఆ భుజాల్ని చూసి ఆ అమ్మాయి ఏడుస్తోందని గ్రహించాను. పట్టుమని ఇరవయ్యేళ్ళన్నా వుంటాయో లేదో! ధరించిన నగా నట్రనీ, కట్టుకున్న చీరనీ చూసి మధ్యతరగతి పైమెట్టు మీది పిల్లని గ్రహించాను. పలకరించబోయి మానుకున్నాను - ఏం కష్టంలో వుందో ఏమో, ఏడవనీ, గుండె బరువైనా దిగుతుంది అనుకుంటూండగానే కళ్లమీదికి నిద్ర కూరుకొచ్చింది నాకు, ఇంతలో ఈ రావులమ్మొచ్చి డిస్టర్బ్ చేసింది.

"ఒంటేలుకు పోయొత్తాను, నా సోటు సూసిపెడతావేటమ్మా" అంటూనే పైకి లేచి ఆత్రంగా పరుగెట్టింది రావులమ్మ. వెనకనించి ఆమెని పరిశీలనగా చూసేను. ఎర్ర రిబ్బను ముక్క కట్టిన జుట్టుని రెండు మడతలేసి నడినెత్తిన కొప్పులాగా కట్టింది. ఎర్రటి రామబాణం పూలగుత్తిని ఆ కొప్పులో గుచ్చింది. నలభైకి దగ్గరుండొచ్చు వయసు. ఒక్క వెంట్రుకన్నా తెల్లబడలేదు. నెత్తిన ఏదో బరువు మోస్తున్నట్టు లయబద్ధంగా వేస్తూన్న ఆమె అడుగుల్ని గమనిస్తూ కూర్చున్నాను. బైట ఆగి ఎవర్నో అడుగుతోంది. ఒంటేలు కెటుపోవాలని కాబోలు, అవతలి వ్యక్తి వేలుతో దారి చూపించి తన దారిన తను పోయాడు.

"ప్రెబుత్వం దెగ్గిర డబ్బుల్లేవంట, ఆ లోటంతా జనమ్మీదేస్తారు. ఎలక్షన్లయ్యేదాకా కాపెట్టుకుని కూసున్నారు. ఆ పబ్బం కాస్తా గడిసిపోగానే రేట్లన్నీ పెంచెయ్యకపోతే నా సెవికోయించుకుంటాను" పేపరు చూస్తున్న ఒకాయన పెద్దగా అంటున్నాడు.

చూస్తే, బస్సంతా ఎప్పుడో నిండిపోయింది, జనంతో కిటకిటలాడుతోంది. కండక్టరు, డ్రైవరు మాత్రం అయిపులేరు.

"ఇంకానా బాబూ, కాస్త మనుషులు తినగలిగే బియ్యం కిలో పదకొండూ పన్నెండూ అమ్ముతోందిప్పటికే. మన ఆంధ్రాలో ఏనాడైనా ఎరిగున్నామా? ఎందుకూ పనికిరాని చెత్త నూనెలు కిలో యాభయ్యీ, అరవయ్యీను. బ్రెమ్మంగారు చెప్పినట్టు సంచినిండా డబ్బు పట్టుకెళ్లి జేబునిండా సరుకులు తెచ్చుకునే రోజులొచ్చేసినై" అంటున్నాడో ఉంగరాలాయన.

"ఇక్కడింకా నయం, హైద్రాబాదులో కిలో బియ్యం పదమూడూ పధ్నాలుగూ".

"రాజధాని కదా, అన్నిట్లోనూ ముందుండాలని".

"ఏం కరువుకాలమొచ్చిందిరా బాబూ, మనుషులింక పస్తులుండాలేమో కొన్నాళ్ల పోతే".

"ఈ లెక్కన రేసను బియ్యం కూడా పెరిగిపోతాయిగావాల" దిగాలుగా అంటున్నాడో మాసిన గెడ్డపు ముసలాయన.

"దీనంతటికీ కారణం మీ రేషను బియ్యం కాదంటయ్యా! ఇంకో పక్కన సారా ఎత్తేసారయ్యె. ప్రెబుత్వానికి డబ్బుల్రమ్మంటే ఎక్కణ్నుంచొస్తై?"

"బాబూ, నాదో మనవి. సారా ఎత్తేసాక కూడా మా వూళ్లో సారా ఏర్లై పారతా వుంది. మూకుమ్మడిగా ప్రెబుత్వం అనే దాందగ్గిర డబ్బుల్లేకపోవచ్చేమోగాని, ప్రెబుత్వంలో వున్న శానామంది కాడ కోట్లు మూలుగుతూ వున్నయ్యండి. ఆరా డబ్బుని బైటికి తియ్యరు. మనకీ దరలు దిగనే దిగవు" వెనక సీట్లోంచి ఆవేశంగా సెలవిచ్చాడొకాయన.

ఇంతలో ఓ యువకుడు చేతిలో సూట్‌కేసుతో బస్సెక్కాడు. అతని చూపులు నా పక్కనున్న అమ్మాయి మీదికొచ్చి ఆగాయి. "నువ్విక్కడున్నావా, ఆఫీసు నించొచ్చేసరికి అమ్మ చెప్పింది నువ్వు బయలుదేరేవని, సూట్‌కేసు వదిలేసి వచ్చేవేం?" అంటున్నాడు, దగ్గరకొచ్చి ముఖం నిండా చికాకు నింపుకుని.

"మా అమ్మ చీరలు కట్టుకోవచ్చునీ..." ఆ అమ్మాయి దీనంగా చూస్తోందతనివైపు. ఆ కళ్లల్లో ఇంకా కన్నీళ్లు సుళ్లు తిరుగుతూనే వున్నాయి.

"ఎందుకా వెధవేడుపు? అక్కడికెళ్లి ఇలాగే ఏడ్చి ఏడ్చి మళ్లీ ఉత్త చేతుల్తో తిరిగొస్తావు కాబోలు. ఈసారదేం కుదర్దు. ఎలా సాధించుకొస్తావో అంతా నీ మీదే ఆధారపడి ఉంది. పెళ్లిలో నీ బాబు ఏడుస్తూ ఇచ్చేడు కట్నం. అందుకే నా బిజినెస్సిలా తగలడింది. మరో లక్ష అయినా ఇవ్వందే పని జరగదని చెప్పు" ఆమెకి మాత్రమే విన్పించేలా అని సూట్‌కేసుని దభాలున వదిలేసి విసవిసా నడిచి బస్సు దిగిపోయాడా మగమహారాజు.

ఆ అమ్మాయి ముక్కునీ కళ్లనీ మరోసారి కర్చీఫ్‌తో ఒత్తుకుని సూట్‌కేస్‌ని పై రేక్‌లో పెట్టడానికి లేచి నిలబడింది.

"నా నెడతానుండమ్మా" అంటూ వచ్చింది రావులమ్మ.

అంత సూట్‌కేస్‌నీ సునాయాసంగా పైకెత్తి రేక్‌లోపెట్టి "ఓల మ్మేటున్నాయమ్మిందులో. ఇంత బలువున్నాదీ, ఇయ్యన్నీ కోకలే?" అంది. "నువ్వెక్కడదాకా?" నన్ను పకలరిస్తూ సంచి తీసి ఒళ్లో పెట్టుకుని చతికిలబడింది.

చూపుడు వేలు ఎడం చెవిలో అడ్డంగా వుంచుకుని ఎక్కడికెల్తున్నానో చెప్పేను.

"నాను రాజమండ్రం" అంది. "ఈ ఇసిత్రం ఇన్నావా, ఆ గదిలోకెల్లి మనుచ్చ మనం ఏసుకుంటే డబ్బులడుగుతున్నారు" అని కిసుక్కున నవ్వింది. నాకూనవ్వొచ్చిందా మాటకి.

"ఆ దెవడో తలకిమాసినోడు దారటుకేసి సూపించేడు కానీ ఇంత పెద్ద ఆరుబయల్లో ఎక్కడోసోట ఏస్కోలేమేటి, అందుకే నానెప్పుడూ ఈ బస్సులెక్కను. ఏటరిజెంటైనా తంటాయే, రైలు బండైతే అదేటుండదు, మనిస్టం" రావులమ్మ గొంతు ఖంగుమంటోంది. చుట్టుపక్కల సీట్లవాళ్లంతా మావేపే చూస్తున్నారు. కిటికీ పక్కమ్మాయి మొహం ఇటు తిప్పి నిరాసక్తంగా చూసింది.

"ఉప్పుడీ పెట్టట్టుకొచ్చిన తెల్లబట్టల కుర్రోడు మీయాయనా?" అనడిగింది రావులమ్మ అటుతిరిగి ఆరా తీస్తూ. "మీ యమ్మగారింటికెల్తన్నావా? ఏతంటాడు. ఏటి తెమ్మని సతాయిత్తన్నాడు మీయాయన?" ఆ అమ్మాయెంతకీ సమాధానం చెప్పకపోయే సరికి "ఉతికిన గుడ్డలేసుకుంటే మాయతనిలాగే ఉండీవోడు" అంది.

"ఇప్పుడు లేడా?..." అన్నట్టు సాలోచనగా ఆమె నుదుటి మీద కుంకాన్ని చూస్తున్ననన్ను చూసి "ఈకాడే, ఈ వొయిజాగులోనే వున్నాడు. ఆడికేం దున్నపోతునాగున్నాడు. ఆడికీ నాకూ పణ్నేదు. ఉంకో నంజికూతుర్తో తిరుగుతుంటే నా నూరుకుంతానేటి? మాటామాటా వచ్చింది. ఆ మాట పట్టింపుకోసం "ఓ రెల్లేస్' అని నానే అణ్నొగ్గేసి రాజిమండ్రం ఎలిపోనాను. అక్కడుంకొకణ్ని కట్టుకున్నాను. ఆయతను శానా మంచోడు. జట్టు కూలీకిందుంటాడు. రోజుకి నలపై ఏపై సంపాదిత్తాడు. నాను మాత్రం కాలీగా కూకుంతానేటి, లా జాంపేట బజారు పక్కని సీకటి బజారంతారు ఎరికేనా, ఆకాడ ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, వంకాయలు గట్టా అమ్ముతాను. రోజుకెలాగ నేదన్నా ఒంద కాయితం కల్ల సూడోల్సిందే" అంది గొప్పగా భుజాలెగరేసి.

"నేనేం మాట్లాడకపోయే సరికి నా మొహాన్నోసారి పరికించి చూసి సంజాయిషీ చెప్తున్నట్టు అంది "ఈ రెండో సచ్చినోడు అంతా మంచోడే, కాపోతే ఒచ్చిందంతా తాగి తలకోసుకుంటాడు".

"హతోస్మి" నిట్టూర్చేను నేను. ఎక్కడైనా ఆడవాళ్ల నోటివెంబడి 'సుఖంగా వున్నాం' అనే మాట వినపడుతుందా?.

"అయ్యో పాపం" అన్నాను నేను ఆగలేక, జాలిగా "ఎందుకమ్మా అయ్యోపాపం? ఆలంతటోలాలైతే, మనంతటోల్లం మనం. ఇల్లిడిగ్గి పిల్లసూడు ఆకాణ్నుంచి ఎలాగేడుత్తుందో! సదుం కుంటన్నారెంతుకమ్మా, సదువులియ్యే నేటి నేర్పిత్తన్నాయి మీకు? దైర్నంగా వుండాల, దైర్నంగా బతకాల సేవుంటేని"

ఆ అమ్మాయి మొదటిసారి సాలోచనగా రావులమ్మ మొహంలోకి చూసింది.

ఒక్కసారిగా బస్సులో కలకలం మొదలైంది. మహారాజు, మంత్రి గారుల్లాగ డ్రైవరు, కండక్టరు బోర విరుచుకుంటూ బస్సెక్కేరు. కిళ్లీలు నములుతున్న పళ్ల మధ్య సిగరెట్లు జ్వాజ్వల్యమానంగా వెలుగుతున్నై. ఒక్కసారిగా బస్సంతా పొగతో నిండిపోయింది. నేను ఆత్రంగా పర్సులోంచి రుమాలు తీసి ముక్కుకడ్డం పెట్టుకున్నాను.

నా ఇబ్బంది గమనించి రావులమ్మ "ఓ కంటాక్టరు బావూ! నువ్వూ డైవోరూ చిగిరెట్టు పారెయ్యండాతల. నేపోతే ఈయమ్మకి డోకొచ్చీసీనాగున్నాది" అంటూ అరిచింది.

ఏ కళనున్నాడో కండక్టరు సిగరెట్టు, విసిరేసి, టికెట్ల బుక్కు చేతిలోకి తీసుకున్నాడు. డ్రైవరు మాత్రం చిద్విలాసంగా ఓ నవ్వు నవ్వేసి తన సింహాసనం మీదికి పోయికూర్చుని పొగమేఘాలు సృష్టించసాగేడు.

"ఆడి జిమ్మడిపోనూ, ఎదవ సచ్చినోడు, ఇంటాడేటి మన మాట"అని తిట్టింది రావులమ్మ.

బస్సు కదలబోతూన్న చిహ్నంగా డ్రైవరు అదే పనిగా హారను మోగించడం మొదలుపెట్టేడు.

కిటికీ బైటనించి "రావులప్పా, ఓలి రావులప్పా" - కేక వినపడింది.

"ఓరేత్రా అప్పిగా" జవాబుగా అరిచింది రావులమ్మ.

"ఈ బస్సులోనే వున్నావా, ఎలిపోయినావేటో అనుకుని కంగారడిపోనానే" రంగు నిక్కరు, బొమ్మల బనియను తొడుక్కున్న నల్లటి బక్కపలచని కుర్రాడొకడు సత్తుకేరియరుతో బస్సులోకెక్కేడు. "ఈ టిపినీ మరిసిపోనావే".

"ఓరి ఓరి, నా మతి మండిపోయిందొరే, బాబ్బాబూ, బాగానే తెచ్చిపెట్నావు, ఈ కవళ పరిగిలంటే మీమాయకి సేనా ఇట్టం. ఏటిలాగ మరిసిపోవాను, ఎప్పుడూనేంది".

"ఆ... మనవడి సంబరంలోపడి" అని పళ్లికిలించేడు అప్పిగాడు.

"మాబాగా సెప్పినావొరే" - కేరేజి మూత తీసి ఓసారి చూసుకుంది రావులమ్మ. ఒక్కసారిగా చేపల వాసన బస్సంతా గుప్పుమంది.

కిటికీ పక్క అమ్మాయి ఓసారిటు తిరిగి రావులమ్మని చిరాగ్గా చూసింది. మళ్లీ తల తిప్పుకొని కూచుంది.

"దిగరా సన్నాసప్పడా!" అన్నాడు కండక్టరు సీటుపక్కనున్న స్తంభాన్ని పంచింగ్ మెషిన్‌తో ఠంగ్ ఠంగ్‌మనిపిస్తూ.

"వాల్ రైట్... రాయిర్" అనరిచేడు అప్పిగాడు పెద్ద గొంతుకతో. డోర్ దగ్గిరికిపోయి మెట్ల మీద నిల్చున్నాడు. మళ్లీ అరిచేడు "రైర్... రా...యిర్" బస్సు కదిలింది.

"ఇల్లిదిగిందుకే మాబొట్టి ఈణ్ణి పేమించినట్టుగుంది. ఇంత పెద్ద ఇసాపట్నంలో ఈ గుంటడికి తెల్నోల్లు నేరు. నేపోతే ఈడికి పిల్లనిచ్చేదేటి, పన్లోకెల్లిన్నాడెల్తాడు, లేన్నాడు నేదు" అంటోంది రావులమ్మ.

"మీ అల్లుడా?" అన్నాను నేను ఉండబట్టలేక.

"అవునుమీ" అంది రావులమ్మ. "నా కొకటే బొట్టి. అల్లముందోడికే పుట్టినాది. ఈ రెండోవోడికాడ మరినేరు పిల్లాపిసికీని. అది సదుంకుంటానంటే ఇక్కడే ఆస్టల్లో పెట్టి సదివించినాను. శానా బాగుంటాది బొట్టి, మీ సదుంకున్నోల్లనాగ లైసుగా వుంటాది".

"ఓల్డాన్, ఓల్డాన్" సన్నాసప్పడి కేక.

డ్రైవరు వెనక్కి తిరిగి చిరాగ్గా చూసేడు. సెంటర్లో స్లో అయిన బస్సులోంచి ఒక్కురుకు ఉరికేడు అప్పిగాడు.

కండక్టర్ టిక్కెట్లిస్తూ రావడం చూసి బొడ్లోంచి కొంగు బైటికిలాగి ముడివిప్పి ఐదు పది నోట్లు బైటికి తీసి చేత్తో పట్టుక్కూర్చుంది రావులమ్మ. ఎక్కడికో విన్నాక ఇంకో ఆర్రూపాయలిమ్మన్నాడు.

"ఇదేటన్నేయం బావూ, మూడ్రోజులవ్వనేదూ మావోడొకడు ఇసాపట్నం నుంచి రాజిమండ్రం బస్సులో వొచ్చి. ఆడు నలపై ఎనిమిది రూపాయిలకే ఛచ్చినాడు. ఆడమనిసిగందా అని అన్నేయం సెయ్యకు కంటాట్టరు బావూ" అంది రావులమ్మ.

"అది మామూలు బస్సై ఉంటాది, ఇది లగ్జరీ. సెమీ లగ్జరీ అయితే ఇంకా ఎక్కువయ్యేది తెల్సా" అన్నాడ కండక్టరు.

నోరు తెరుచుకుని తదేకంగా చూసింది రావులమ్మ.

"ఏటంటాడీ బావు?" అంది నన్ను చూస్తూ.

నాకు శ్రమివ్వడం ఇష్టంలేని వాడిలా కండక్టరు రావులమ్మకి లగ్జరీ అని దేన్నంటారో, సెమీలగ్జరీ అని దేన్నంటారో అంతా వివరించి చెప్పేడు.

"ఓసోసి, ఏటి బావూ, మనవేటన్నా ఇందులో శాసినీతంగా కాపరం వుండిపోతావేటి? ఎవలవన్నా ఇక్కడెక్కి అక్కడ దిగేటోలవే. నానే సీటూ ఎక్కకుండా కింద కూకునేత్తాను. నన్నుట్టినే డబ్బులుచ్చుకోకుండా తీసుకెల్తావేటి?".

బస్సులో అందరూ ఫక్కుమని నవ్వేరు.

'తల్లీ నీతో వాదించుకుంటూ కూసోడానికి నాకు టైం లేదు. డబ్బులు తీస్తావా లేదా" అని గద్దించేడు కండక్టరు.

"ఉచ్చుకోవయ్యా, ఆర్రూపాయలకే నువ్వేటి పెద్దోడివైపోతావో ఎన్ని మేడలు కట్టేత్తావో నాను సూణ్నా ఏటి?"

కిటికీ పక్కమ్మాయి కండక్టరు చిల్లరెంతిచ్చాడో లెక్కపెట్టుకోకుండా పర్సులో వేసేసుకోవడం చూసి ముక్కు మీద వేలేసుకుంది రావులమ్మ. ఆ పిల్లని రెండు క్షణాలు అట్టే తదేకంగా చూసి "అయిదోనెలా?" అనడిగింది భుజం మీద తట్టి.

అవునో కాదో తెలీకుండా ఒక్కసారితలాడించి ఊరుకుందా అమ్మాయి.

"కిందటేడు మా బొట్టిని అయిదో నెల్లోనే పిలుసుకెల్లినాను రాజిమండ్రం. పుట్టిన కుఱ్ఱోడికి ఏడో నెల వచ్చేసినాది. మనవూరుకుంటే ఆడెంతకాలమైనా అలాగే ఆదమరిసిపోయి ఊరుకుండిపోతాడని నానే అట్టుకొచ్చి దింపేసి ఎలిపోతన్నాను. ఈకొత్తకోక - ఉప్పుడు మా యల్లుడు రానేదూ సన్నాసప్పుడు, ఆడు కొనెట్టినాడు. రైక ముక్క కూడా కొన్నాడు గానీ, ఉప్పుడుకుప్పుడేం కట్టించుకుంతాం?" అంది, తన వెలిసిన జాకెట్టునోసారి భుజం దగ్గర సవరించుకుని, "ఏదేల రూపాయల బిడ్డ సారెట్టినాను మంచాలూ కుంచాలూ అన్నీని. ఎయ్యి రూపాయిలు సంటోడి పేరుతో బేంకులో ఏసినాను. నానేం తక్కువ సెయ్‌నేదు. ఏదో బగమంతుడిచ్చినకాడికి అలాగ దర్జాగా ఎలిపోతన్నాది బతుకు-".

స్వగతంలా చెప్పుకుపోతోంది రావులమ్మ. ఆ సొద వింటూ నేనెప్పుడు నిద్రలోకి జారుకున్నానో నాకే తెలీదు.

"ఇదేవి నిద్రోలమ్మ, కొండమీద గుళ్లూ గోపరాలూ ఎంతందంగున్నాయో సూడు సూడు" అని తట్టి లేపుతోంది రావులమ్మ. బద్ధకంగా కళ్లు విప్పేను. కొంచెం సేపు ఎక్కడున్నానో అర్థంకాలేదు. నా మస్తిష్కంలో ఇంకా అరకువేలీ అందాలే సుళ్లు తిరుగుతున్నై.

వాచీ చూసుకున్నాను. అయిదున్నర కావస్తోంది. బస్సు కిక్కిరిసిపోయి వుంది. నిలబడ్డవాళ్ళు రాడ్స్ పుచ్చుకుని ఒంటికాలిమీద వేళ్లాడుతున్నారు. అస్తమించబోతున్న సూర్యకాంతిలో అన్నవరం కొండమీద దీపాల వరుస వెలవెలపోతోంది.

కాళ్లు కొంత ముందుకు చాపుకొని బద్ధకంగా ఒళ్లు విరుచుకోబోతూ పక్క సీటు వైపు చూసేను. ఆ సీట్లో ముందుకూర్చున్న అమ్మాయి లేదు. ఇంకెవరో ముసలావిడ చెంపలేసుకుని కొండ మీది దేవుడికి దణ్ణాలు పెడుతోంది.

"ఆ అమ్మాయేదీ?" ఇటు తిరిగి కొంత ఆతృతగా అడిగేను. ఆ అమ్మాయి కూడా మా వూరికే టిక్కెట్టు తీసుకుందని తెలుసు నాకు.

"ఏయమ్మాయి, ఇక్కడ కూసున్న పిల్లేనా? ఇక్కడదాకా ఎందుకొచ్చిందీ, అనకాపిల్లికివతల పండాలదిబ్బనేదూ అల్లక్కడ దిగిపోనాది" అంది రావులమ్మ. నా మనసేదో కీడును శంకించింది.

"ఇది ఎక్స్‌ప్రెస్ బస్సు, అక్కడెందుకాగింది". కీచుమంది నా గొంతు.

"ఏటలాగిదైపోతన్నావేటి? ఆ పిల్లకక్కడ సుట్టాలున్నారు గావాల, ఎవులో ఒంటేలు కెల్తాం ఆపమన్నారు. ఆ పిల్ల కూడా దిగినాది. ఇంకెక్కనేదు. అకాడికీ నేనంతానే వున్నాను - 'ఇల్లిక్కడ దిగిపోయీ దానికి అంత పెద్ద టిక్కట్టెందుకు కొయించీసుకున్నావని"

అట్నుంచి మేం అరకువేలీకి టూరిస్ట్ బస్‌లో వెళ్లాం. దార్లో బస్సు పండాలదిబ్బ దగ్గర ఆపి అందర్నీ రిఫ్రెష్ కమ్మన్నాడు డ్రైవరు. 'పండాలదిబ్బ' బోర్డు చూసి మా స్టాఫ్ అందరూ నవ్వుకున్నారు. బోర్డు తప్ప అక్కడికి దరిదాపుల్లో ఊరెక్కడా కన్పించదు.

"నెక్స్ట్ హాల్ట్ దెయ్యాల దిబ్బా?" అంటూ పిల్లలు డ్రైవర్ని ఆటపట్టించారు. తిరిగి వచ్చేటప్పుడు నేను కొంత పనిపడి ఓ రోజు విశాఖలో ఆగిపోయాను. పండాలదిబ్బలో వున్న పెద్ద దిగుడుబావి నా కళ్లకి కట్టినట్టైంది. అసంకల్పితంగా పైకి చూసేను. అక్కడ ఆ అమ్మాయి తాలూకు సూట్‌కేసు లేదు. "హమ్మయ్య" అని రిలీఫ్ ఫీలయ్యాను "చావును కోరుకునే అమ్మాయైతే సూట్‌కేసెందుకు పట్టుకెళ్తుందిలే" అని నాకు నేనే సర్దిచెప్పుకున్నాను.

❋ ❋ ❋

జూన్‌రెండో వారంలో స్కూల్స్ రీ ఓపెన్.

మే చివరి వారంలో కొత్త టీచర్స్‌ని ఇంటర్వ్యూకి పిలిచాం. ఖాళీ వున్నవి రెండు పోస్టులు. రెండు వేలకి పైగా అప్లికేషన్స్ వచ్చాయి. క్వాలిఫికేషన్స్ సరిపోయిన లోకల్‌వాళ్లుగా చూసి ఓ ఇరవై మందిని ఇంటర్వ్యూకి పిలిచాం. కరస్పాండెంటుగా నేను ఇంటర్వ్యూ దగ్గరుండి జరిపించాల్సిన బాధ్యత వహించాల్సి వుంది.

మధ్యాహ్నం రెండు కావస్తోంది. ఇంటర్వ్యూ ముగియవచ్చింది. అదే ఆఖరి అప్లికేషన్. పి. నవనీత. పేరు బావుంది.

కర్చీఫ్‌తో ముఖాన్ని అద్దుకుంటూ లోపలికి అడుగుపెట్టిన ఆ అమ్మాయిని చూస్తూనే ఇది వరకు ఎక్కడో చూసానన్పించింది.

విష్ చేసి, మేం చూపించిన కుర్చీలో కూర్చుంది. మెరుస్తున్న కళ్లతో అడిగే ప్రశ్నలకు టకటకా సమాధానాలు చెప్తోంది.

"ఇంటర్వ్యూ ముగిసింది మేడమ్. మీరేమైనా అడుగుతారా?" అంటున్నారు మా ప్రిన్సిపాల్ రావుగారు. ఆలోచనల్లో పడి నేనేమీ అడగనే లేదు. ఆ అమ్మాయి కళ్లు వాల్చి చేతిగోళ్లని పరిశీలించుకుంటోంది. అప్పుడు గుర్తుకొచ్చింది నాకు, ఈ అమ్మాయి నేనా రోజు బస్సులో చూసిన అమ్మాయేనని.

నాలో క్యూరియాసిటీ.

అప్లికేషన్స్ అన్నీ అయిపోయినట్టేగా, "మీరెళ్లండి" అన్నాను.

రావుగారు, మా అసిస్టెంట్ జానకి లేచి బైటికెళ్లారు.

"నన్ను గుర్తుపట్టావామ్మా?" అడిగాను.

ఒక్క క్షణం కనుబొమలు ముడివేసి చూసింది. "సారీ మేడమ్".

నేను చెప్పాను.

ఒక చిన్న విషాద వీచిక ఆ ముఖంలో పారాడి తప్పుకుంది. అంతలోనే ఎంతో ఆత్మస్థైర్యం నిండుకుందా కళ్లల్లో. "గుర్తుపెట్టుకున్నారే" ముఖం నిండా నవ్వు నింపుకొంది.

నువ్వా పండాలదిబ్బ దగ్గర దిగిపోయావని తెలీకపోతే ఎప్పుడో మరచిపోయి వుందును. ఆ ప్రయాణం తర్వాత ఇంచుమించు నెల రోజులు రాత్రులు నిన్ను తల్చుకుని మధనపడ్డాను".

"సారీ" సిగ్గుపడిందా అమ్మాయి. "మీకు శ్రమ కలిగించేను".

"ఉత్త పిరికితనం, అర్థంలేని ఆవేశంతో దిగిపోయానక్కడ. బావిలో నీళ్లు చూసాక భయం వేసింది. అంతలో వెన్ను తట్టినట్టు రావులమ్మ మాటలు గుర్తుకొచ్చినై. 'అక్షరజ్ఞానం లేని రావులమ్మకున్న ధైర్యం నాకెందుకు లేకపోవాలి!, అన్పించింది. నా కాళ్ల మీద నేను నిలబడాలన్న జ్ఞానోదయం అయింది. అందుకే అమ్మ దగ్గరకొచ్చేసి ఈ గేప్‌లో బి.ఎడ్ పూర్తి చేసాను".

"అయితే నువ్వా రావులమ్మని మరచిపోలేదన్నమాట!"

"ఎలా మరచిపోగలను మేడమ్, నాకు స్ఫూర్తినిచ్చిందే ఆవిడ".

"మీ నాన్నగారేం చేస్తున్నారిక్కడ?"

"నాన్నగారు లేరు. ఇల్లూ వాకిలీ అమ్మి నా పెళ్లి చేసిన కొన్నాళ్ళకే కాలం చేశారు.ఆ తర్వాతే అమ్మ ఉద్యోగంలో జాయినైంది. ప్రస్తుతం అమ్మా, నేను, పాపాయి వుంటున్నాం ఇక్కడ".

"ఐసీ, మీ అమ్మగారిక్కడే జాబ్ చేస్తున్నారా, ఎక్కడ?"

"ఇక్కడే"

"మా స్కూల్లోనా? మీ అమ్మగారి పేరేమిటి?"

నా మొహంలోని ఆశ్చర్యం చూసి కాబోలు ఆ అమ్మాయి పెదవుల మీద సన్నని నవ్వు నిండుకుంది.

"నిర్మల.. అటెండరు".

*ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, శ్రీధాత దీపావళి ప్రత్యేక సంచిక*